ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను సోదా చేస్తున్న సిబ్బంది

సైదాబాద్‌: 10వ తరగతి వార్షిక పరీక్షలు సైదాబాద్‌ జోన్‌ పరిధిలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సైదాబాద్‌ జోన్‌ పరిధిలో పరీక్షల నిర్వహణకు 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో బాలురు 2523, బాలికలు 2515, మొత్తం 5038 మంది హాజరుకావాల్సి ఉండగా తొలిరోజు 5023 మంది హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా వారిలో 8 మంది బాలురు, ఏడుగురు బాలికలు ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్టడీ హాళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

చైతన్యపురి: ప్రతి స్టడీ హాల్‌లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్టేషన్ పరిధిలోని స్టడీ హాల్స్ నిర్వాహకులతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టడీ హాల్‌కు వచ్చే ప్రతి విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలన్నారు. రాత్రి 11 గంటలకు హాళ్లను మూసివేయాలన్నారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మారయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

సైదాబాద్‌: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ దుర్గావాణి అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కరుణశ్రీ సేవా సమితి కారుణ్య సింధు ఆశ్రమంలో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్స్ మొదటి బ్యాచ్ శిక్షణా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్థిక స్వావలంబన కోసం మహిళలు ఏదైనా అంశంలో శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఆచార్య కడారి సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, కోశాధికారి రాజపేట సత్యనారాయణ పాల్గొన్నారు.

'బీజేఆర్ భవన్‌కు మరమ్మతులు చేయించండి'

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మరమ్మతులు చేయించాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఎల్‌బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మేముగంటి సంపత్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. రాబోయే బాబు జగ్జీవన్ రామ్ జయంతి లోగా మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబా ఆలయ వార్షికోత్సవం

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ 17 వ వార్షికోత్సవ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొలన్ వెంకటర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరివి జంగయ్య గుప్తా, కోశాధికారి రావుల రంజిత్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం నగర సంకీర్తన, సాయికాగడ హారతి, గణపతి దత్తాత్రేయ స్వామి అభిషేకం, అర్చన, షిరిడీ సాయి బాబాకు పంచామృతా అభిషేకం, లక్ష్మి గణపతి హోమం, శ్రీ సాయి మధ్యాహ్న హారతి, పల్లకీ సేవ, శేష హారతి నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

నేడు ఎస్‌బీహెచ్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ఓజోన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఈసీజీ, కంటి చూపు పరీక్ష, దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలనీ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జలకాలాటకు..

ఈత కొలనులు సిద్ధం!

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో అందుబాటులోకి స్విమ్మింగ్‌పూల్స్



సచివాలయనగర్‌లోని స్విమ్మింగ్‌పూల్

స్విమ్మింగ్‌పూల్‌ల వేళలు...

- ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు
- సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు
- సచివాలయనగర్‌లో మహిళల కోసం ఉదయం 10 నుంచి 11గంటల వరకు
- వనస్థలిపురం ఫేజ్‌-4లో మహిళల కోసం సాయంత్రం 3 నుంచి 4 వరకు ఉంటుంది

వనస్థలిపురం: ముదురుతున్న ఎండలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. వేసవిలో చల్లని నీటిలో జలకాలాడితే ఆ హాయే వేరు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికై ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పదుల సంఖ్యలో ప్రైవేటు స్విమ్మింగ్‌పూల్‌లు ప్రారంభం అయ్యాయి.



సచివాలయనగర్ స్విమ్మింగ్‌పూల్ వద్ద కోచ్‌ల గదులు, దుస్తులు మార్చుకునే గదులు

కాగా ప్రజల కోరిక మేరకు, ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నియోజవర్గం పరిధిలోని జీహెచ్‌ఎంసీ ఆధీనంలోని రెండు స్విమ్మింగ్‌పూల్‌లు గురువారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో...

వనస్థలిపురం డివిజన్ పరిధిలో వనస్థలిపురం ఫేజ్‌–4లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో 2022లో రూ.1.50 కోట్లతో స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించారు. అలాగే బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సచివాలయనగర్‌లో రూ.3కోట్ల నిధులతో మరో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. అనంతరం వీటి నిర్వహణ బాధ్యతలను జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. ప్రైవేటు స్విమ్మింగ్‌పూల్స్‌లలో ఫీజులు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు, యువత జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌ల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు.

గతేడాది ఆలస్యంగా...

జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్వహణ లోపంతో గతేడాది ఏప్రిల్ నెల చివరి నాటికి కూడా వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ లలోని స్విమ్మింగ్‌పూల్‌లు తెరచుకోలేదు. సచివాలయనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌కు చెందిన రెండు బోర్లు ఎండిపోవడం, వనస్థలిపురం ఫేజ్‌–4లో కూడా నీటి సమస్య రావడంతో ఏప్రిల్ చివరి వరకు స్విమ్మింగ్‌పూల్‌లు మూతపడి ఉన్నాయి. దీంతో విద్యార్థులు, యువత తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఎట్టకేలకు ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో ట్యాంకర్ల నీటితో స్విమ్మింగ్‌పూల్‌లను నింపి గత ఏడాది ఎలాగో మమ అనిపించారు.

ఈసారి ముందుగా మేల్కొలుపు...

గతేడాది జరిగిన దానిని ఈసారి పునరావృతం కాకుండా చూడాలని, మార్చి నుంచే స్విమ్మింగ్‌పూల్‌లను అందుబాటులోకి తేవాలని స్థానికులు ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి స్విమ్మింగ్‌పూల్‌లను ప్రారంభించాలని వారికి సూచించారు. ఈ క్రమంలో గురువారం నుంచి వనస్థలిపురం ఫేజ్‌–4, సచివాలయనగర్‌లలోని స్విమ్మింగ్‌పూల్‌లు అందుబాటులోకి వచ్చాయి.

నీటి కొరత కారణంగా ఆలస్యం...

సచివాలయనగర్‌లో బోర్లు ఎండిపోవడం వల్ల నీటి సమస్య వస్తోంది. అందుకే స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించడంలో ఆలస్యం జరిగింది. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి స్విమ్మింగ్‌పూల్‌ను నింపారు. గురువారం నుంచి రెండు స్విమ్మింగ్‌పూల్‌లు తెరచుకున్నాయి. స్విమ్మింగ్ చేయాలని అనుకునేవారు జీహెచ్‌ఎంసీ యాప్‌లో నెల రుసుం చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈత నేర్చుకునే వారికి శిక్షణ ఇవ్వడానికి ఒక్కో స్విమ్మింగ్‌పూల్ వద్ద 8 మంది కోచ్‌లు ఉన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా కోచ్ ఉన్నారు.

– వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీ



వనస్థలిపురం ఫేజ్‌-4లోని స్విమ్మింగ్‌పూల్



వనస్థలిపురం ఫేజ్‌-4లో దుస్తులు మార్చుకునే గదులు

దోమల నివారణకు చర్యలు



డ్రోన్ ద్వారా దోమల మందు స్ప్రే చేయిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో దోమల నివారణకు నిరంతర చర్యలు తీసుకుంటున్నామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లో దోమల బెడద తీవ్రం కావడంతో శుక్రవారం ఆయన మోహన్ నగర్ జనప్రియా, ఆర్‌బీ కాలనీ, బాలాజీ నగర్, సమతపురి కాలనీ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా దోమల మందు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో దోమలను లార్వాదశలోనే నియంత్రించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లోని పూల కుండీలు, చెట్లల్లో, నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కాలనీలో షెడ్యూల్ ప్రకారం దోమల మందు, ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రాంబాబు, నాయకులు అశ్విన్ సింగ్ ఠాగూర్, తోట మహేందర్ యాదవ్, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్‌గౌడ్

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాగోలు డివిజన్ మాజీ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని జైపురికాలనీ బ్లెండ్స్ కాలనీలో స్వశక్తి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెర్కు సంగీత ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ మహిళ ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి పుష్ప, ఆశాజ్యోతి, ఉమాదేవి, విజయలక్ష్మి, శోభరాణి, మమత, డాక్టర్ శిల్ప, ఉపాధ్యాయులు బాల, రామదేవి, భారతమ్మ, ప్రమీల, మంగ, సరస్వతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



వీకర్ సెక్షన్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: వేసవి నేపథ్యంలో డివిజన్ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్‌కాలనీ, ప్రెస్‌కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంచినీటి సరఫరా లో ప్రెషర్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జలమండలి అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. పాడైపోయిన పవర్‌బోరులను మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజు, రమేష్, భవానీ, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.15, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.45, మునగ రూ.23, కందగడ్డ రూ.60, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మహిళ అదృశ్యం



చైతన్య (ఫైల్)

సైదాబాద్‌: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలనీకి చెందిన ఆంజనేయులు భార్య చైతన్య గత డిసెంబర్ 28న ఇంట్లో నుచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త ఆంజనేయులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సదస్సులో సిటీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన పీజీ విద్యార్థుల బృందం వరంగల్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌ఐటీ డైమండ్ జూబ్లీ సదస్సులో పత్ర సమర్పణ చేసింది. రెండు రోజుల పాటు కొనసాగే ఆసెంట్‌–2025 జాతీయ సదస్సులో సిటీ కాలేజ్ విద్యార్థుల బృందం గ్రీన్ టెక్నాలజీ ఆధారంగా నానో కాంపోజిట్స్‌పై పరిశోధనను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. బాలభాస్కర్ విద్యార్థుల బృందాన్ని అభినందించారు.

ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న ఆర్‌ఎం సుచరిత తదితరులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతిచక్ర పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు మాధవి, జగన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 25 మంది సిబ్బందికి నగదు పురస్కారాలు అందజేసి, ప్రశంసా పత్రాలు, శాలువాలతో సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కిరణ్‌బేడీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మహిళా కండక్టర్లు శ్రీదేవి, అనితలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, ఎంఎఫ్ వెంకటేష్, సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ గణేష్‌పురి కాలనీకి చెందిన గౌరవ్‌గౌడ్ గత కొంత కాలంగా వెన్నెముక సమస్యతో బాధ పడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవటంతో అతడి కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని శస్త్ర చికిత్స చేయించుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని శుక్రవారం బాధితుడి తల్లి సంధ్యకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే తన ధ్యేయమని డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.27లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, ప్రదీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మురికి వాడల సమాచారం సేకరణ



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, యూసీడీ సిబ్బంది

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం అధికారులు శుక్రవారం మూసారంబాగ్ డివిజన్‌లో మూసీనదికి ఇరువైపులా కిలో మీటర్ పరిధిలో ఉన్న నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ మురికివాడల సమాచార సేకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. సిబ్బందికి సహకరించి పూర్తి వివరాలు అందజేయాలని బస్తీ వాసులకు సూచించారు. పొదుపు సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలను సంఘాల్లో చేరేవిధంగా ప్రోత్సహించాలన్నారు. మూసీ రిసర ప్రాంత వాసుల ఇబ్బందులు, వీధిదీపాలు, రోడ్ల మరమ్మతులు, పాడైన మ్యాన్‌హోల్స్ తదితర సమస్యలు నమోదు చేయించాలన్నారు. మెరుగైన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూసీడీ ఆర్‌ఓలు ఆండాలు, పద్మావతి, రేణుక, బస్తీవాసులు అంబాబాయి, రాజేశ్వర్, ఉమేష్, శోభ, పరశురామ్, నాగభూషణం తదతరులు పాల్గొన్నారు.

మహేశ్వరంను 'ఫ్యూచర్'లో కలపాలి



ఎమ్మెల్యే సబితారెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం: ఎన్నికలకు ముందు మహేశ్వరంను మహానగరంగా తీర్చిదిద్దుతామని, ఫ్యూచర్ సిటీగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ఇప్పుడు ఫ్యూచరే లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై సరైన ప్రణాళిక, విధివిధానాలు లేకుండా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని కొన్ని గ్రామాలనే ఫ్యూచర్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించి.. మిగతా గ్రామాలను కలపకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్ గ్రామాలను విలీనం చేసిందని, మిగతా గ్రామాలను కలిపే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పిస్తే ఇదే అంశంపై మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ ఆనందం, మోతిలాల్ నాయక్, శివగంగ, ఆలయ మాజీ చైర్మన్లు ఎం.నవీన్, సుధీర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమారిరాయప్ప పలువురు పాల్గొన్నారు.

విలీనం చేసేవరకు ఉద్యమిస్తాం

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమిస్తామని మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి అన్నారు. శుక్రవారం మండల పరిధి అమీర్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి.. మహేశ్వరాన్ని మహానగరంగా మార్చుతామని, ఫ్యూచర్ సిటీ చేస్తామని హామీనిచ్చి, విస్మరించారని ఆరోపించారు. ఫ్యూచర్‌లో మండలంలోని రెండు గ్రామాలు తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్‌ను విలీనం చేసి, మిగతా 28 జీపీలను కలపలేదన్నారు. శనివారం నుంచి ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కలిసి సమస్యలను వివరిస్తామని పేర్కొన్నారు. ఇదే విషయమై.. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలుస్తామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్, జేఏసీ నాయకులు మల్లేశ్ యాదవ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, నందిగామ నర్సింహ, అంద్యా నాయక్, కడారి జంగయ్య యాదవ్, హన్మగళ్ల చంద్రయ్య, యాదగిరి గౌడ్, ఎద్మ మోహన్‌రెడ్డి, దత్తు నాయక్, రవి నాయక్, ఆవుల యాదయ్య, యాదగిరి రెడ్డి, జగన్‌రెడ్డి, నవీన్, రమేష్, మాధవచారి పలువురు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

చార్మినార్: సుల్తాన్ షాహిలోని షాహిన్ ఉమెన్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్రంలో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. హింసకు గురైన మహిళలు, బాలికలకు అవసరమైన మద్దతు కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో షాహిన్ ఉమెన్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా చంపాపేట్‌లో ప్రారంభించనున్న సఖి సెంటర్‌లో పని చేసేందుకు వివిధ కేటగిరిలో దరఖాస్తులు ఆహ్వానిస్తుర్నుమన్నారు. ఈనెల 22 నుంచి 29 సాయంత్రం 5 గంటల్లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను అందజేయాలన్నారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, సైకో సోషల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్, పారామెడికల్ వర్కర్, ఐటీ అసిస్టెంట్, మల్టీపర్పస్ వర్కర్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సుల్తాన్ షాహిలోని సంస్థ కార్యాలయంలో గాని.. 8179390420 ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు.